క్లుప్తంగా

స్పందనకు 12 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం : స్పందనలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై సిబ్బందికి ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. స్పందనలో మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 5 మ్యుటేషన్, 6 భూతగాదాలు, 1 శ్మశానానికి రహదారి సౌకర్యం కల్పించాలని అర్జీలు అందాయి. వీటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వో, సర్వేయర్లకు సూచించారు.

స్పందన అర్జీలను ఆన్‌లైన్‌లో పెట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం : మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో జరిగే స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను తప్పకుండా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సచివాలయంలో స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో పెడితే వాటిని పరిశీలించి వారివారి సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలిమహేష్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండాకాలంలో జాగ్రత్తలు పాటించండి



వైద్యం చేస్తున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధరనెల్లూరు: ఎండాకాలంలో వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జీడీనెల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. మండలంలోని అగరమంగళం వెంకటాపురంలో సోమవారం(ఫ్యామిలీ ఫిజిషియన్) ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దీర్ఘకాలిక రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగులు మందులు తప్పకుండా వాడాలని, డాక్టర్ సలహాలు పాటించాలన్నారు. ప్రజలు ఎండలు అధికంగా ఉన్నప్పుడు బయట తిరగకపోవడం మంచిదన్నారు. నీళ్లు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైతే దగ్గరలోని పీహెచ్‌సీల్లో చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో..



సూచనలు ఇస్తున్న సీడీపీఓ పద్మజ

పుత్తూరు రూరల్: గర్భిణులు, బాలింతలు, పిల్లలు వేసవి జాగ్రత్తలు పాటించాలని సీడీపీఓ పద్మజ కోరారు. సోమవారం కల్యాణపురం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ వేడి తీవ్రత నుంచి రక్షణ పొందడానికి ద్రవ పదార్థాలను అధిక శాతంలో తీసుకోవాలని సూచించారు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి పానీయాలు శ్రేయస్కరమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకుని పిల్లలకు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

23న ఘంటసాల పాటల పోటీలు

తిరుపతి కల్చరల్: ఘంటసాల గాన కళాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 23న మహతి కళాక్షేత్రంలో ఘంటసాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్‌రెడ్డి, ఉదయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయని అనంతరం సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 9177707201, 9849660992 నంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

అర్హతే కొలమానం..అభివృద్ధే ధ్యేయం

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- టీడీపీ హయాంలో ఇలా ఎందుకు ఇవ్వలేదు ?
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



పథకాల లబ్ధి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: అర్హతే కొలమానంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం.. గ్రామ సచివాలయాలు, వలంటీరు వ్యవస్థ ద్వారా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం' అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. సోమవారం మండలంలోని పాతగుంట గ్రామ సచివాలయ పరిధిలోని బలిజపల్లె, బలిజపల్లె దళితవాడ, పాతగుంట ఎగువూరు, దిగువూరు, ఆదిఆంధ్రవాడ, చెన్నుగారిపల్లె, భాష్యంవారికండ్రిగ, ఎస్టీ కాలనీ గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి ఆరా తీస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎవరూ చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ హయాంలో కేవలం జన్మభూమి కమిటీలు, పెత్తందార్ల కోసం పాకులాడి నిజమైన పేదవాడికి మోసం చేసినట్లు ఆరోపించారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ నేరుగా ఇంటి వద్దే ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. 14 ఏళ్లుగా అధికారంలో ఉన్న చంద్రబాబు గ్రామీణ రోడ్లను ఎందుకు ఆధునీకరించలేక పోయాడన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు అందుతుంటే పప్పుబెల్లాల్లా పంచి పెడుతున్నారంటూ హేళన చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు పథకాలు అందజేయడం వారికి మింగుడుపడడం లేదని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే నవరత్నాల ద్వారా ప్రజలు అనుభవిస్తున్న లబ్ధిని దూరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. పథకాలతో జగనన్న ప్రజలకు దగ్గర అయ్యాడని భావించి టీడీపీకి ఏం చేయాలో పాలుపోవడం లేదని చెప్పారు. సీఎం జగనన్న అందిస్తున్న సుపరిపాలనతో నిరాశ, నిస్పృహతో ఉన్న టీడీపీ అడ్డదారులు తొక్కి వ్యవస్థలను నాశనం చేస్తూ కుట్రలకు తెరలేపుతోందని ఆరోపించారు.

అందరికీ పథకాలు అందాలి..

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందాలని మంత్రి నారాయణస్వామి అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైన చోట సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఈ రామాంజనేయులును ఆదేశించారు. పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని హౌసింగ్ ఏఈని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు వెలుగు ద్వారా రుణాలు అందించాలని ఏపీఎం కవితను ఆదేశించారు. రాజకీయ స్వార్థం కాకుండా ప్రజా అవసరాల కోసం అందరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైస్ ఎంపీపీ విజయ, ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ పుల్లారెడ్డి, సర్పంచ్‌లు భువనేశ్వరి, గోవిందయ్య, అబ్బులురెడ్డి, శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోవిందన్, చిన్నబ్బ రెడ్డి, స్థానిక నాయకులు బొజ్జారెడ్డి, రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

దళితుల శత్రువు చంద్రబాబు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: తొలి నుంచి కూడా చంద్రబాబు దళితులపై కపట ప్రేమను చూపించి వారిని పావుగా వాడుకుని అణగదొక్కాడని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పాతగుంటలో మీడియాతో మాట్లాడారు. 14 ఏళ్లుగా సీఎంగా ఉన్నప్పుడు దళితుల పట్ల ఎలా ప్రవర్తించారో అందరికీ తెలుసని, ఎవరైనా దళితులుగా పుట్టాలని కోరుకుంటారా? అని వ్యాఖ్యానించి అన్ని విధాలా అవమానపరిచిన బాబు దళితుల పాలిట శత్రువు అయ్యాడని ఆరోపించారు. టీడీపీ నేతలు మత విద్వేషాలను రెచ్చగొట్టి గ్రామాల్లో విధ్వంసాలను సృష్టిస్తున్నారన్నారు. భారతదేశంలోనే పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి ప్రజల మననును గెలుచుకున్న ఏకై క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనను ప్రజల నుంచి దూరం చేయడం ఎవరితరం కాదన్నారు. లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నాడో, ప్రజలకు ఎలాంటి మంచి చేస్తానని చెప్పున్నాడో, అతని గమ్యం ఏంటో అర్థం కాలేదన్నారు. దిశ దశ లేని దత్త పుత్రుడు పవన్ వ్యవహారశైలిని చూస్తే జాలేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, బీసీ సెల్‌రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, బూత్ కమిటీ నియోజకవర్గ కన్వీనర్ నారాయణరెడ్డి, బొజ్జా రెడ్డి, ఎంపీటీసీ చిన్నబ్బ పాల్గొన్నారు.

మంత్రి రోజాకు వినతి



మంత్రి ఆర్‌కే రోజాకు వినతిపత్రం అందిస్తున్న చాంద్‌బాషా

పుత్తూరు రూరల్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజాకు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా వినతిపత్రం అందజేశారు. రెండో విడత సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని, బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. అనంతరం మంత్రి కార్యాలయంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలంలోని 14 పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అందుకు తగిన విధంగా నిధులు సైతం విడుదల అవుతున్నాయని ఎంపీడీఓ బి.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పటికప్పుడు నిధులు అందుతున్న కారణంగానే సర్పంచులు పనులు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. తడుకు పంచాయతీలో గడచిన మూడేళ్లలో రూ.35,91,883కు వివిధ పనులు చేయగా, రూ.33,61,883 చెల్లించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా సీఎఫ్ఎంఎస్ ముగిసిందని, దీంతో మిగిలిన రూ.2.30 లక్షలు చెల్లింపులు జరగలేదన్నారు. త్వరలోనే సీఎఫ్ఎంఎస్ ఓపెన్ అవుతుందని, మిగిలిన చెల్లింపులు జరుగుతాయని స్పష్టం చేశారు. అయితే దీన్ని కొన్ని పత్రికలు పంచాయతీలకు నిధులే విడుదల కావడం లేదంటూ అసత్య ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. మొత్తం చెల్లింపుల్లో 94 శాతం నిధులు చెల్లించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు.

సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మరథం



చింతకాల్వలో ప్రచార సామగ్రిని పంపిణీ చేస్తున్న నాయకులు

వడమాలపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు నవరత్నాలు అందిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నారని మండల జేసీఎస్ కన్వీనర్ సురేష్‌కుమార్ రాజు అన్నారు. సోమవారం వడమాలపేట మండలం ఎస్వీపురం, పత్తిపుత్తూరు, పూడి సచివాలయ పరిధిలోని వలంటీర్లు, గృహసారథులు కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గృహసారథి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. టీడీపీ, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై ఉందన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాయంపేట సింగిల్‌విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సదాశివకోన బోర్డు మెంబర్ కమల, సుబ్రమణ్యం రెడ్డి, గాంధీ, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగరాజపురం: ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు, సచివాలయ కన్వీనర్లు

ఇంటింటా జగనన్న నినాదం

శ్రీరంగరాజపురం: మండలవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం తరఫున అందిన మేలును తెలియజేస్తూ, స్టిక్కర్‌ను అతికిస్తున్నారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి అభిప్రాయం సేకరిస్తున్నారు. సోమవారం ఒడ్డుపల్లి, కమ్మకండ్రిగ, మిట్టహరిజనవాడ, తయ్యూరు, నెలవాయి, మెదవాడ, బసివిరెడ్డిపల్లి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాబు, వరదమ్మ, ఉమామహేశ్వరి, నాయకులు జనార్దన్, బాబు, మణి, సుధాకర్ తంబీ, కుమార్, ఉమాపతి, ఆనంద్, యోగానందం, దొర తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి సోమవారం మండలంలోని పాతగుంట గ్రామ సచివాలయ పరిధిలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

బీజేపీ పాలనను సాగనంపుదాం



ప్రచారభేరి నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

నగరి : ప్రజలపై భారం మోపుతూ, ప్రభుత్వ రంగ సంస్థలు అమ్ముతూ, కొత్త పరిశ్రమలు తీసుకురాని మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే అని సీపీఐ, సీపీఎం నాయకులు ప్రచారం చేశారు. ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం వారు పట్టణ పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి కేంద్రప్రభుత్వ తీరును, ప్రధాని మోదీని గద్దెదింపాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 30వ తేదీ వరకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ప్రచారభేరి యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ కార్యవర్గ సభ్యులు బాషా, విజయ్‌కుమార్, రూప్‌కుమార్, మురళి, సీపీఎం కార్యదర్శి పెరుమాళ్, ఏఐటీయూసీ నాయకులు మణి, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలనకు బ్రహ్మరథం



కేశవకుప్పంలో జగనన్న స్టిక్కర్లు అంటిస్తున్న మండల కన్వీనర్ శేఖర్‌రాజు

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని మండల కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కేశవకుప్పం, జీలవారికండ్రిగ, తానాఇండ్లు, కేశవకుప్పం ఎస్టీకాలనీ గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ ప్రతి సామాజికవర్గం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి జగనన్న నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పటికే 99 శాతం హామీలను నెరవేర్చారని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో చేసిన మోసాలను గుర్తు చేస్తూ, జగనన్న అందిస్తున్న సంక్షేమాలను వివరిస్తూ ప్రజల అంగీకారంతో గోడలకు మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో కేశవకుప్పం సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ దేశమ్మ, నాయకులు దొరస్వామి, మాణిక్యాలరెడ్డి, చందురాజు, రాజ, చంద్రశేఖర్, ధనంజయరాజు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పలువురు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నగరి : అగ్నిప్రమాద నివారణపై విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన ఏర్పరచి సలహాలు సూచనలు అందించారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గుండ్రాజుకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లిన వారు విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణ, మంటలను అదుపుచేసే ప్రక్రియలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపకానికి ఉన్న రక్షణ సామగ్రిని వారికి చూపి వాటి ప్రయోజనాలను తెలిపారు. ఎవరైనా నీటిలో పడిపోయినా, ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగిన తమకు సమాచారం అందిస్తే తాము అక్కడకు విచ్చేసి వారిని ప్రమాదాల బారి నుంచి రక్షిస్తామని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి మస్తాన్, అగ్నిమాపక సిబ్బంది డ్రైవర్ ఆపరేటర్ విజయ్, లీడింగ్ ఫైర్‌మెన్ డీసీ రాజు, ఫైర్‌మెన్ ప్రకాష్, కోటేశ్వరరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



విద్యార్థుల నుంచి సమాధానం రాబడుతున్న ఎంఈఓ

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే సీగ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఏ గ్రేడ్ వచ్చేలా ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఆముదాల ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమికస్థాయి నుంచే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం చేయాల్సిన బాధ్యత సంబంధిత హెచ్‌ఎంలపై ఉందని తెలిపారు. అనంతరం వెనుకబడిన పిల్లలకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బాబు పాల్గొన్నారు.

టైర్ల రీసైక్లింగ్ ఫ్యాక్టరీ ఎదుట నిరసన

నగరి : మండలంలోని నాగరాజు కుప్పం సమీపంలో నిర్వహిస్తున్న టైర్ల రీసైక్లింగ్ ఫ్యాక్టరీ వద్ద గ్రామస్తులు సోమవారం నిరసనకు దిగారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యం కారణంగా గ్రామంలో అనారోగ్య వాతావరణం నెలకొందని ఆరోపించారు. ఫ్యాక్టరీని నిర్వహించడం లేదంటూ బుకాయించే యాజమాన్యం రాత్రి పూట ఫ్యాక్టరీని నిర్వహించి కాలుష్యానికి కారణమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకుని కాలుష్యాన్ని నివారించాలని కోరారు.

ప్లాస్టిక్ అమ్మకాలపై జరిమానా



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న సచివాలయ సిబ్బంది



హోటళ్లలో తనిఖీ చేస్తున్న సిబ్బంది

పుత్తూరు రూరల్: మున్సిపాలిటి పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శులు సోమవారం పట్టణంలోని పలు దుకాణాలలో అక్రమంగా విక్రయిస్తున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. షాపుల్లో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న వివిధ ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పలు హోటళ్లలో రంగులు కలిపిన ఆహార పదార్థాలు విక్రయించరాదని, మాంసపు అంగళ్లలో నిల్వ మాంసాన్ని అమ్మరాదని అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా ప్రదోష కాల పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశ్వరున్ని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

- సస్యరక్షణ చర్యలతో క్రిమికీటకాల నివారణ
- భూసార పరీక్షలు తప్పనిసరి అంటున్న వ్యవసాయ అధికారులు
- పంటల సాగులో మెలకువలు పాటిస్తున్న అన్నదాతలు



వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాలసముద్రం: పంట కోతల తరువాత మళ్లీ వర్షాకాలంలో వర్షాలు కురిసేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. వేసవి దుక్కుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా రెండు గుంటకలు వేయాలని సూచిస్తున్నారు. అలాగే ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

వేసవిలో పొలాల్లో పంటలు సాగులో ఉండవు గనుక చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమిని ఆశ్రయిస్తాయి. వేరుశనగ, పప్పుశనగ, మిరప, కంది తదితర పంటలకు ఆశించే పచ్చ పురుగు, లద్దె పురుగులు వంటి భూమిలో ఉంటాయి. వేసవిలో లోతు దుక్కులు వేయడం వల్ల నేలలో ఉన్న చీడ పురుగుల కోశాలు, గుడ్లు బయటపడి వేడికి చనిపోతాయి. కొంగలు, కాకులు మొదలైన పక్షులు వాటిని తిని నాశనం చేస్తాయి. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతు దుక్కులను చేయడంతో పురుగు మందుల వ్యయం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటలు కోసిన తరువాత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోకి ఇంకుతుంది. ఈ దుక్కుల వల్ల ఇతర గడ్డిజాతి మొక్క విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు గురై మొలిచే శక్తిని కోల్పోతాయి. వేసవి దుక్కులు చేపట్టడానికి ఏప్రిల్‌లో అనువైన సమయం, ఇప్పుడు దుక్కులు చేపట్టడం వల్ల వేరుకుళ్లు తెగుళ్లను కలిగించే శిలీంద్ర సిద్ధబీజాలు నిరంతరం భూమి అడుగుభాగానే ఉంటూ వర్షం పడగానే విజృంభించి పంటలను నాశనం చేస్తాయి. అదేవిధంగా భూమి అడుగు భాగాన ఉన్న గడ్డిమూలాలు వర్షం పడగానే పెరిగిన పంటను దెబ్బతీస్తాయి. వీటిని నివారించడానికి వేసవి సమయంలో పొలాల్లో ఒకటిన్నర అడుగులోతు వరకు రెండు మడకలతో వేసవి దుక్కులు చేపట్టాలి. దీనివల్ల భూమి లోపల ఉన్న శిలీంద్ర సిద్ధ బీజాలతో పాటు, గడ్డిమూలాలు కూడా బయటకు పడి అధిక ఉష్ణోగ్రతకు నశించిపోతాయి. వేసవి దుక్కులు చేపట్టడం వల్ల భూమి వదులుగా మారి వర్షం పడినప్పుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటుంది.

పశువుల ఎరువుతో మేలు..

దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలంలో చల్లుకోవాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి. మార్చి రెండోవారం నుంచి మే మొదటివారం వరకు వేసవి దుక్కులు చేపట్టడానికి అనుకూలమని తెలిపారు.

భూసారం పెరుగుతుంది..



వేసవి దుక్కుల వల్ల భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయటపడి కీటకాలు నశిస్తాయి. తద్వారా పురుగు మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటల కోత తరువాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. తొలకరి వర్షాలు కురిసినప్పుడు భూమిలోకి నీరు ఇంకిపోయి నేల సారవంతం అవుతుంది. ప్రతిరైతు తప్పనిసరిగా భూసారం పరీక్షలు చేయించుకోవాలి. ఇందు కోసం ఆర్బీకేల్లోనే అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలి.

– ఢిల్లీప్రసాద్, ఏఓ, పాలసముద్రం